జీవనోపాధులు ... భవితవ్యం

సెప్టెంబర్ 2016

‘క్షేత్రం’

# ఛోటా నాగ్‌పూర్ పీఠభూమి

ఛోటా నాగ్‌పూర్ పీఠభూమి ఈ భూమిపై అత్యంత పురాతన భూభాగాలలో ఒకటి. ఇది సుమారు **50** కోట్ల ఏళ్ల క్రితం ఏర్పడి ఉంటుందని భావిస్తున్నారు. ఈ పీఠభూమి గంగా, సోన్ నదీ పరివాహక ప్రాంతాలకు మధ్య ఉంది. చరిత్ర ప్రకారం, ఈ పీఠభూమిని నాగవంశీయులు పాలించారు. వారి రాజ్యం నుంచే ఛోటా నాగ్‌పూర్ అన్న పేరు వచ్చింటుందని భావిస్తున్నారు. ఈ పీఠభూమికి జార్ఖండ్‌లోని చుతియా అన్న గ్రామంలో కోట ఉంది. ఈ పీఠభూమిలోని ఎక్కువ భాగం జార్ఖండ్ రాష్ట్రంలో ఉంది. దీని సరిహద్దులు ఒడిషా, బీహార్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఉన్నాయి. ఇది **47,100** చదరపు మైళ్ల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఈ పీఠభూమి రాంఛీ, హజారీబాగ్, కోడర్మ పీఠభూముల కలయికతో ఏర్పడింది.






ఛోటా నాగ్‌పూర్ పీఠభూమి ఈ భూమిపై అత్యంత పురాతన భూభాగాలలో ఒకటి. ఇది సుమారు 50 కోట్ల ఏళ్ల క్రితం ఏర్పడి ఉంటుందని భావిస్తున్నారు. ఈ పీఠభూమి గంగా, సోన్ నదీ పరివాహక ప్రాంతాలకు మధ్య ఉంది. చరిత్ర ప్రకారం, ఈ పీఠభూమిని నాగవంశీయులు పాలించారు. వారి రాజ్యం నుంచే ఛోటా నాగ్‌పూర్ అన్న పేరు వచ్చింటుందని భావిస్తున్నారు. ఈ పీఠభూమికి జార్ఖండ్‌లోని చుతియా అన్న గ్రామంలో కోట ఉంది. ఈ పీఠభూమిలోని ఎక్కువ భాగం జార్ఖండ్ రాష్ట్రంలో ఉంది. దీని సరిహద్దులు ఒడిషా, బీహార్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఉన్నాయి. ఇది 47,100 చదరపు మైళ్ల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఈ పీఠభూమి రాంఛీ, హజారీబాగ్, కోదర్మ పీఠభూముల కలయికతో ఏర్పడింది.

ఈ పీఠభూమి ప్రధానంగా మూడు భాగాలుగా విభజించబడి ఉంది. పీఠభూమికి చెందిన పశ్చిమ భాగం దీనిలో ఎత్తైనది. ఇది 900–1100 మీటర్ల ఎత్తు ఉంటుంది. రెండో భాగం తిరిగి మూడు భాగాలుగా విభజించబడింది. దీనిలో ఎక్కువ భాగం పాత రాంచీ, హజారీబాగ్ జిల్లాలోను, కొన్ని ప్రాంతాలు పాత పాలము జిల్లాలోనూ ఉన్నాయి. ఇది 600 మీటర్ల ఎత్తు ఉంటుంది. ఇక మూడోదైన తక్కువ ఎత్తున్న ప్రాంతం పురూలియా, సింగ్‌భుమ్ జిల్లాలలో విస్తరించి ఉంది. ఇది 300 మీటర్ల ఎత్తులో ఉంటుంది.

ఈ పీఠభూమి ప్రాంతంలో రెండు జతల నదులు ప్రవహిస్తున్నాయి. మొదటి జత నదులు దక్షిణ ప్రాంతంలో ప్రవహిస్తుండగా, రెండో జత నదులు ఉత్తర ప్రాంతంలో ప్రవహిస్తున్నాయి. దామోదర్, బరాకర్, కోయల్, సువర్ణరేఖ నదులు ఈ పీఠభూమి గుండా ప్రవహిస్తున్న నదులు.

ఈ పీఠభూమిలో శీతోష్ణస్థితి ఆర్ద్రతతో, లేదా ఆర్ద్రతకన్నా తక్కువగా ఉండి వేసవి, శీతాకాలం రెండూ తీవ్రంగా ఉంటాయి. ఈ పీఠభూమిలో సగటున 1000 నుంచి 1600 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుంది. ఈ ప్రాంతంలో 150–210 రోజుల పాటు ఆర్ద్రతగా ఉంటుంది. ఏడాదిలో సుమారు 90 రోజుల పాటు ఇక్కడి భూమి పొడిగా ఉంటుంది. ఇక్కడ భూమిలో ఎక్కువ భాగం ఎర్రమట్టి నేలలు. వందల ఏళ్ల నుంచి కొండలు పరిణామం చెంది ఇవి ఏర్పడి ఉంటాయని భావిస్తున్నారు. ఇక్కడ ఇతర రకాల నేలలు – అభ్రకపు నేలలు, నల్ల రేగడి నేలలు, లేటరైట్ నేలలు, ఇసుక నేలలు ఉన్నాయి.

ఈ పీఠభూమి అడవులతో నిండిన పెద్ద, చిన్న కొండలతో నిండి ఉండడం వల్ల విస్తృతమైన వృక్ష, జంతుజాలం కనిపిస్తుంది. ఆ ప్రాంతంలో సాల వృక్షాలు ఎక్కువ. పీఠభూమిలో ఎక్కువ భాగం వెదురుచెట్లు, పొదలు కనిపిస్తాయి.

ఈ ప్రాంతంలో పులులు, నాలుగు కొమ్ముల జింకలు, బ్లాక్‌బక్, చింకారా జింకలు, ధోల్ అడవి కుక్క, ఎలుగు బంట్లు, ఏషియన్ జాతి ఏనుగులు కనిపిస్తాయి. అంతే కాకుండా అరుదుగా కనిపించే ఫ్లోరికాన్, ఇండియన్ గ్రే హార్న్‌బిల్, హార్న్‌బిల్‌లకు ఇది ఆవాసంగా ఉంటోంది.

ఈ పీఠభూమిలో అనేక విలువైన ఖనిజ వనరులున్నాయి. దామోదర్ లోయలో భారీ ఎత్తున బొగ్గు గనులున్నాయి. హజారీబాగ్‌లో ప్రపంచంలో అతి పెద్ద మైకా గనులున్నాయి. ఈ పీఠభూముల్లో బొగ్గు, ఇనుప ఖనిజం, చైనా క్లే, క్రోమైట్, డోలమైట్, కాపర్, సున్నపురాయి, బాక్సైట్, యాస్‌బెస్టాస్, ఫెల్డ్‌స్పార్, ఫైర్ క్లే, కియోనైట్, అపెటైట్, మాంగనీస్, సిలికా, స్టీటైట్, వెనెడియం స్టీటైట్, యురేనియం, బంగారం, యాంటిమోని ఖనిజాలున్నాయి. మొత్తం మైకా ఉత్పత్తిలో 40 నుంచి 70% ఇక్కడి నుంచే జరుగుతోంది. గతంలో ఇక్కడి ఖనిజాలను, ఖనిజ ఉత్పత్తులను దేశంలోని ఇతర ప్రాంతాలకు తరలించడానికి కోల్‌కతా, పాట్నాలకు రైల్వే లైన్‌లను నిర్మించడం జరిగింది. బొకారో ప్రాంతంలో విద్యుత్ ఉత్పత్తి కొరకు ఒక భారీ థర్మల్ ప్లాంట్‌ను నిర్మించారు. ఈ ప్రాంతంలో ఒక భారీ స్టీల్ మిల్లును కూడా నిర్మించారు.

ఈ పీఠభూమి పరిసరాలలో ఇనుము, స్టీల్, ఆటోమొబైల్స్, రైలు ఇంజన్లు, రసాయనాలు, ఎరువులు, పేలుడు పదార్థాలు, బొగ్గు, సిమెంట్, భారీ ఇంజనీరింగ్, మెషీన్ టూల్స్, కాగితం, యాస్‌బెస్టాస్, గాజు, పింగాణి, రిఫ్రాక్టరీ, భారీ యంత్రాల పరిశ్రమలు, కాపర్‌ను కరిగించే పరిశ్రమలు, జికా అల్యూమినియం పరిశ్రమలను స్థాపించారు. ఈ పరిశ్రమలు రాంఛీ, హజారీబాగ్, గిరిధ్, ఝుమ్రి–తిలయ్యా, చైబాసా, జంషెడ్‌పూర్, జరియా, ధన్‌బాద్, దల్‌తాన్‌గుంజ్, హరిహర్‌గుంజ్, గర్వా, జల్పా పట్టణాలలో నెలకొల్పారు.

ఈ పీఠభూమిలో అనేక జలపాతాలు, అటవీ ప్రాణులు, వృక్ష జంతు జాలం, జాతీయ పార్కులున్నాయి. దీని వల్ల పర్యాటకం మీద ఆధారపడుతున్న ప్రజలకు జీవనోపాధి లభిస్తోంది. ఇక్కడున్న జలపాతాలలో ఫెరువాగాఘ్ జలపాతం (17మీటర్ల ఎత్తు), హుండ్రు జలపాతాలు (75మీటర్ల ఎత్తు), దసామ్ జలపాతం (40 మీటర్ల ఎత్తు), సాండీ జలపాతం (60 మీటర్ల ఎత్తు) ప్రముఖమైనవి. రాంఛీకి కొంత దూరంలో ఉన్న కంకె డ్యామ్ ఇక్కడ ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతం.

ఈ పీఠభూమి అనేక ఆస్ట్రిక్ తెగలకు ఆవాసం. ఇక్కడి జనాభాలో వీరు 22.5 శాతంగా ఉన్నారు. మొత్తం 30 తెగల వారు ఇక్కడ కనిపిస్తారు.

వారిలో సంతాల్, హో, ఖరియా, ముండా, ఒరాన్ ప్రముఖమైనవి. వీరు వేటాడటం, పోడు వ్యవసాయం, ఇతర చేతి వృత్తుల మీద ఆధారపడి జీవిస్తున్నారు. వీరికి ఎలాంటి సొంత నేలా ఉండదు. వీరు వేట మీద, అటవీ ఉత్పత్తుల సేకరణ మీద, తాళ్లు పేనడం మీద, కొన్ని సమయాలలో చేపలు పట్టడం మీద ఆధారపడి జీవిస్తారు.

ఈ పీఠభూమిపై సాధారణ వర్షపాతం కురుస్తుంది. ఇక్కడ దట్టమైన అడవులు, విభిన్నమైన వాతావరణం కలిగిన ప్రాంతాలు కనిపిస్తాయి. ఇక్కడ అనేక ఖనిజాలు, గనులున్నా దేశంలోని అత్యంత వెనుక బడిన ప్రాంతాలలో ఇది ఒకటిగా ఉంది. ఇక్కడి అతి విస్తృతమైన జీవనోపాధులు కనిపిస్తాయి. ఇక్కడి ప్రజలలో ఎక్కువ మంది జీవనోపాధి కొరకు వ్యవసాయం మీద ఆధరపడి జీవిస్తారు.

## చోటా నాగ్‌పూర్ పీఠభూమి

**చోటా నాగ్‌పూర్ పీఠభూమి 3 భాగాలుగా విభజించబడివుంది. అవి: 1. రాంచి & హజరిబాగ్ పీఠభూమి, 2. మన్‌భూమ్ ప్రాంతం, 3. సింగ్‌భూమ్ ప్రాంతం.**

**ఈ పీఠభూమి ఖనిజసంపదకు పుట్టినిల్లు. అవి: మైకా, బాక్సైట్, కాపర్, ఇనుము, సున్నం, బొగ్గు మొ.వి.**

**ముఖ్యమైన పట్టణాలు: జారియా, రాణిగంజ్, బొకారో, రాంగర్, కరన్‌పూర్, జంషెడ్‌పూర్, అసన్‌సోల్, దుర్గాపూర్, బర్ధమాన్, రాంచి మొ.వి.**

ఈ ప్రాంతంలో వర్షపాతం మెరుగ్గానే ఉన్నా, ఎగుడుదిగుడు నేలలు, బురద నేలలు, నీటి పారుదల సౌకర్యాలు లేకపోవడం, నాసిరకం పంట దిగుబడి విధానాలు, నేల సంరక్షణ విధానాల కారణంగా పంట దిగుబడి చాలా తక్కువగా ఉంది. ఇక్కడి ప్రజలు ఎక్కువగా వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నందువల్ల వారు పొడి, ఆర్ద్రత వాతావరణానికి తగిన మిశ్రమ పంటల మీద ఆధారపడుతున్నారు. ఇక్కడ వరి, మొక్కజొన్న, గోధుమ, బార్లీ, చిరుధాన్యాలు, నూనె గింజలు, కాయధాన్యాలను ఎక్కువగా పండిస్తారు. ఈ ప్రాంతపు సరిహద్దులు, గట్టిగా ఉండే నేలల్లో ప్రజలు కరువు పరిస్థితులను, వరద పరిస్థితులను తట్టుకునే దీర్ఘకాలిక రకాల వరిని సాగుచేస్తారు. కొన్ని ప్రాంతాల రైతులు ఎప్పుడు వర్షాలు కురుస్తాయో చెప్పలేని వాతావరణానికి అనుగుణంగా తక్కువ దిగుబడి ఉన్నా ఖచ్చితంగా దిగుబడినిచ్చే, తక్కువ సమయంలో (90 రోజులు) చేతికి వచ్చే గోరా వరిలాంటి పంటలను పండిస్తారు. ఇక నీరు ఎక్కువగా నిలువ ఉండని ఎత్తైన ప్రాంతాలలో తక్కువ వ్యవధిలో (60 రోజులు) చేతికి వచ్చే పంటలను పండిస్తారు. ఈ పీఠభూమిలోని చుట్టుపక్కల ప్రాంతాలలో నీటి లభ్యత ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో చెరుకును కూడా పండిస్తారు.

ఈ ప్రాంతం ఉద్యానవన పంటలను కూడా చాలా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ అనేక రకాల పళ్ల మొక్కలను పండిస్తారు. ఇక్కడ దొరికే సాంప్రదాయ మామిడి రకాలలో బతూరా, బొంబాయి, హిమసాగర్, కిషన్‌బోగ్, గోపాల్‌భోగ్, సుకుల్, రాణీ పసంద్, సఫేద్‌మాల్డా, చౌసా, ఫజాలి, జర్దాలు రకాలు ప్రముఖమైనవి. ఈ ప్రాంతంలో అనేక రకాల వృక్ష జాతులను చూడవచ్చు. ఉద్యానవన తోటల పెంపకంతో పాటు, స్థానిక ప్రజలకు ఇక్కడ లభించే ఔషధ మొక్కల గురించి, వివిధ రకాల జబ్బులకు వాటిని ఉపయోగించుకోవడం గురించి కూడా బాగా తెలుసు. ఉదాహరణకు స్థానికులు కిడ్నీలో రాళ్లకు 'కుర్తీదాల్'ను, పచ్చకామెర్లకు 'కర్‌హైనీ బియ్యం'ను ఉపయోగిస్తారు. కాగితం, తాళ్లు పేనేందుకు ఉపయోగించే వెదురు, సబాయ్ గడ్డి ఈ ప్రాంతంలో విస్తారంగా లభిస్తాయి. వార్నిష్, షెల్లాక్, సీలింగ్ వ్యాక్స్, రంగులను తయారు చేసేందుకు ఉపయోగించే లక్క, లాక్కిఫర్ కూడా ఇక్కడ విస్తారంగా లభిస్తాయి.

దేశం మొత్తంలో ఉత్పత్తయ్యే లక్కలో 41 శాతం ఈ పీఠభూమిలోనే లభిస్తుంది. ప్రసిద్ధి చెందిన టస్సర్ పట్టు కూడా ఈ ప్రాంతానికి చెందినదే. ఈ ప్రాంత ప్రజలు చేపట్టే మరో ముఖ్యమైన జీవనోపాధి – పశుపోషణ. స్థానిక ప్రజలు నల్ల బెంగాల్ మేక, చోటా నాగ్‌పురి మేకలు, ముర్రా జాతి బర్రెలు, బ్రాయిలర్ కోళ్లు, బాతులను పెంచుకుంటారు. పాలు, మాంసం, పాడి ఉత్పత్తుల కోసం తరచుగా సంకరజాతి పశువులను పెంచుతారు. ఈ ప్రాంతంలో నివసించే జనాభాలో 22.5% మంది ప్రజలు గిరిజనులే కావడంతో కలపేతర అటవీ ఉత్పత్తుల సేకరణ ఇక్కడ మరో ప్రధాన జీవనోపాధి. బైగా, అసుర్, చెరో, గోండు, లర్మాలీ, కోందు, కుర్మీ, తారు, కోల్, తమర్, ఖేవార్, బిర్జియా, సవార్, కోర్వా, మల్పహరియా, పర్‌చారియాలు కలపేతర అటవీ ఉత్పత్తుల సేకరణ మీద ఆధారపడి జీవిస్తున్నారు. వాటిని సేకరించాక వీరు వాటిని స్థానిక వారాంతపు సంతలలో కానీ, దళారులకు కానీ విక్రయిస్తారు. ఇక్కడి గిరిజనులు వెదురు, పేము, నూనె గింజలు, కొవ్వు, కార్డేజ్, బుట్టలు మొదలైన వాటిని విక్రయిస్తారు. ఇక్కడ లభించే మహువా పళ్లతో స్థానికుల తమ వినియోగం కొరకు సారాను తయారు చేసుకుంటారు.

ఇక్కడ కనిపించే మరో ఆసక్తికరమైన అంశం – ఇక్కడి ప్రజలు నీటి సంరక్షణ కొరకు వాలుకు అడ్డంగా మట్టి కట్టలు, రాతికట్టలు, మట్టి–రాయి కలిసిన కట్టలను నిర్మిస్తారు. ఆ కట్టలను బలంగా ఉంచడానికి వారు స్థానికంగా లభించే పొదలు, మొక్కలను ఉపయోగిస్తారు. తక్కువ ఖర్చుతో నిర్మించే ఈ కట్టల వల్ల భూక్షయం అరికట్టబడుతుంది. తద్వారా వారు తమ ఇళ్లకు దగ్గరగా ఉన్న ఎత్తైన ప్రాంతాలకు నీటిని అందించగలుగుతారు. వీరు బావులను తవ్వి, ఎత్తులో ఉన్న ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తారు. ఈ పద్ధతిని వీరు 'బార్గీ' అని పిలుస్తారు. ఇలా నీటి పారుదల ఉన్న ప్రాంతాలలో వీరు వాణిజ్య పంటలు, కూరగాయలు వేసుకుని ఒకవైపు తమ ఆదాయాన్ని పెంచుకుని, మరోవైపు వాటిని సొంతానికి

వినియోగించుకుంటారు. ఇక్కడి స్థానిక ప్రజలు నేల పరిస్థితిని బట్టి వివిధ రకాల పంట పద్ధతులను అనుసరిస్తారు.

వనరులతో సుసంపన్నమైన ఈ పీఠభూమిలో ఇటీవలి కాలంలో జనాభా బాగా పెరిగింది. దీంతో మరింత ఎక్కువ భూమిని వ్యవసాయ అవసరాల కోసం ఉపయోగిస్తున్నారు. ఇక్కడి నేలలో ఇంకా చాలా భాగాన్ని వ్యవసాయానికి ఉపయోగించనప్పటికీ, కలపేతర అటవీ ఉత్పత్తుల సేకరణ మీద ఆధారపడే సంచార జాతుల ప్రజలు వాటిని సేకరించడం పెరిగింది. మరోవైపు ఇక్కడ విస్తారంగా వెలిసిన పరిశ్రమలు స్థానిక ప్రజలకు కాంట్రాక్ట్, శాశ్వత, రోజువారీ కార్మికులుగా జీవనోపాధి కల్పిస్తున్నాయి. ఇక్కడ పుట్టగొడుగుల్లా వెలుస్తున్న చిన్న, మధ్య తరహా పరిశ్రమల వల్ల స్థానిక ప్రజలకు అనేక ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.

అయితే ఇక్కడ వైచిత్రి ఏమిటంటే, ఒకవైపు స్థానిక గిరిజన తెగల జీవనోపాధులు అంతరిస్తుంటే, మరోవైపు మైనింగ్, పరిశ్రమలు, అభివృద్ధి ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పశువుల మేత కోసం అంతరించిపోతున్న గడ్డి మైదానాలు, తరచుగా వచ్చే కరువులు, కార్చిచ్చు లాంటివి ఈ పీఠభూమికి ప్రమాదరకంగా పరిణమించాయి. దానికి తోడు ఇక్కడి భూక్షయం, జల ప్రవాహాలు ఆందోళనకరంగా తయారయ్యాయి. అందువల్ల ఈ ప్రాంతంలోని భాగస్వాములంతా ఒక వేదిక పైకి వచ్చి, ఈ పీఠభూమి మరియు ఇక్కడి స్థానిక జాతుల పరిరక్షణ కోసం ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాల్సిన అవసరముంది. ✷